సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 10 । డిసెంబర్ । 2022



గంగవరం – కొత్తపల్లి అటవీ పరిసరాల్లో పులి జాడ కోసం అటవీ అధికారులు అమర్చిన ట్రాప్ కెమెరాకు అరుదైన వన్యప్రాణి పునుగు పిల్లి కదలికలు రికార్డయ్యాయి. – గంగవరం



నేటి నుంచి పాఠశాలలో స్వర్ణోత్సవ సందడి

చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్ణోత్సవాల సందడి నెలకొంది. 8లో

పెరిగిన ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి. శుక్రవారం వేకువజామునుంచి మబ్బు వాతావరణం నెలకొంది. మినుములూరులో 13 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 15 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 16 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మంచు ప్రభావం లేక పర్యాటకులు నిరాశకు గురయ్యారు.

న్యూస్‌రీల్

తహసీల్దార్ మృతికి సంతాపం



మౌనం పాటిస్తున్న కలెక్టర్, పీవో తదితరులు

సాక్షి,పాడేరు: పెదబయలు తహసీల్దార్ ఓ.శ్రీనివాసరావు గురువారం ఆత్మహత్య ఘటనపై అధికార యంత్రాంగం సంతాపం తెలిపింది. కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాసరావు, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో దయానిధి తదితర అన్నిశాఖల అధికారులు శుక్రవారం ఉదయం ఐటీడీఏ సమావేశ మందిరంలో కొద్దిసేపు మౌనం పాటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారంతా శ్రద్ధాంజలి ఘటించారు.

ఖాళీ పోస్టుల భర్తీకి వినతి

గంగవరం: రెవెన్యూ శాఖలో మౌలిక సౌకర్యాలు కల్పించడమే కాకుండా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఏజెన్సీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం కోరింది. ఈ మేరకు సంఘ ఉద్యోగులంతా శుక్రవారం రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఏజెన్సీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి జిలానీ బాషా ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు వారి సమస్యలను సబ్‌కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలు రీ సర్వే, మ్యుటేషన్ కార్యక్రమాలు వేగవంతంగా నిర్వహించాలంటే సిబ్బంది కొరతను పరిష్కరించాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు.

'సరియా' వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు

- ఎస్పీ సతీష్‌కుమార్



జలపాతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

అనంతగిరి : మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన సరియా జలపాతం వద్ద ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఇక్కడి జలపాతం వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో గతనెల 16న 'జలసోయగం.. జరభద్రం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎస్పీ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఎస్‌ఐ రాము ఆధ్వర్యంలో జలపాతం నిర్వహణ కమిటీ ప్రతినిధులు ప్రమాదకర ప్రదేశాలను మూసివేశారు. శుక్రవారం ఇక్కడికి వచ్చిన ఎస్పీ సతీష్‌కుమార్ సీఐ దేముడుబాబు, అనంతగిరి ఎస్‌ఐ రాముతో కలిసి సరియా జలపాతాన్ని సందర్శించారు. పూడ్చివేసిన ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించారు. సీఐ, ఎస్‌ఐలను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవి, మాజీ సర్పంచ్ రాంబాబు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా, మహిళ పోలీసు ఇంద్రజ, కమిటీ సభ్యుడు మహేష్ పాల్గొన్నారు.

హెచ్‌ఎం భర్తపై అట్రాసిటి కేసు నమోదుకు డిమాండ్



ఏపీవోతో మాట్లాడుతున్న ఆందోళనకారులు

రంపచోడవరం: కాకవాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బాలికలపై వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎం భర్త ప్రసాద్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని వేములకొండ గిరిజనులు డిమాండ్ చేశారు. సర్పంచ్ కొమరం పండుదొర ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట శుక్రవారం బైఠాయించారు. ఆరు గంటలపాటు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాలికలను వేధింపులకు గురి చేసిన ఘటన వెలుగులోకి వచ్చి మూడు రోజులు గడుస్తున్నా అధికారులు స్పందించకపోవడంతో ఆందోళన దిగినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీడీఏ ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు ఆందోళనకారులతో మాట్లాడారు. మానటరింగ్ అధికారి, ఏటీడబ్ల్యూవోలు ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తారని ఏపీవో చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. హెచ్‌ఎం భర్తపై బాలికల తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో మరో ఫిర్యాదు చేశారు. ఆందోళనలో ప్రజాసంఘాలు, నాయకులు కుర్ల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుపాను వర్రీ

- 'మాండూస్' ప్రభావంతో ఈదురుగాలులు, భారీ వర్షం
- సురక్షిత ప్రాంతాలకు వరి పనలు తరలింపు
- పంటను కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమైన అన్నదాత



ముంచంగిపుట్టులో వర్షానికి రక్షణగా వరికుప్పలకు రైతులు కప్పిన టార్పాలిన్లు



లగిశపల్లి ప్రాంతంలో వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: జిల్లాలో మాండూస్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో శుక్రవారం రాత్రి నుంచి భారీ వర్షం కురుస్తుండటంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ దిగుబడులు ఎన్నడూ లేనివిధంగా బాగున్నాయి. సకాలంలో ప్రభుత్వ పరంగా సాయం, విత్తనాలు అందాయి. అదేస్థాయిలో ప్రకృతి కరుణించింది. సకాలంలో వర్షాలు కురిశాయి. రైతు పంట పండింది. పంటకోతల పనిలో గిరి రైతులు నిమగ్నమయ్యారు. ఇంతలో వాతావరణ శాఖ తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈదురుగాలుల కూడిన వర్షం రైతుకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. జిల్లాలో 54, 260 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నందు వ్యవసాయ, గ్రామసచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఇప్పటికే 25శాతం భూముల్లో వరి పంట కోతలు పూర్తయ్యాయి. పనలన్నీ పొలాల్లోనే ఉన్నాయి. మిగతా 75 శాతం పైరు పక్వానికి వచ్చి కోతకు సిద్ధంగా ఉంది. చిరు జల్లులు పడుతున్న నేపథ్యంలో పొలాల్లోని వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొంతమంది అక్కడే కుప్పలు వేస్తున్నారు. వర్షానికి దెబ్బతినకుండా వీటిపై ప్లాస్టిక్ కవర్లు కప్పుతున్నారు. భారీ వర్షం కురిస్తే వరి పొలాల్లోంచి నీరు పోయేలా రైతులు బాటలు ఏర్పాటుచేసుకుంటున్నారు.

కొయ్యూరు: తుపాను హెచ్చరికలతో మండలంలోని వరి రైతులు అప్రమత్తమయ్యారు. వరి పనలు కుప్పలుగా ఏర్పాటుచేసి వాటిపై టార్పాలిన్లను ఉంచారు. కొద్దిరోజులు వాతావరణం సహకరిస్తే కోతలు పూర్తయ్యేవని రైతులు తెలిపారు.

హుకుంపేట: తుపాను ప్రభావం కారణంగా శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో వర్షం జల్లులు కురిశాయి. దీంతో వరిపనలు తడిచిపోయాయి. వెంటనే అప్రమత్తమైన రైతులు వరి పనలను కుప్పలుగా ఏర్పాటుచేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

ముంచంగిపుట్టు: మండలంలో శుక్రవారం తేలిక పాటి వర్షం కురిసింది. వరికుప్పలు తడిచిపోకుండా రైతులు టార్పాలిన్ కవర్లు కప్పుతున్నారు.

పెదబయలు: మండలంలో తేలిక పాటి వర్షం శుక్రవారం సాయంత్రం నుంచి ప్రారంభం అయ్యింది. వరితోపాటు చిరుధాన్యాల పంటలకు కూడా పక్వానికి రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాజవొమ్మంగి: తుపాను ప్రభావంతో శుక్రవారం మండల పరిసరాల్లో చిరుజల్లులు కురిశాయి. మండలంలో 6,500 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా, ఇప్పటివరకు 1500 ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. చిరుజల్లులు కురుస్తుండటంతో పొలాల్లోని వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొంత మంది రైతులు నూర్పులు చేసి ధాన్యంపై బరకాలు కప్పుతున్నారు.

యంత్రాలో నూర్పుల జోరు



లగిశపల్లి ప్రాంతంలో యంత్రంలో నూర్పులు

సాక్షి,పాడేరు: తుపాను భయంతో గిరిజన రైతులు యంత్రాల సాయంతో నూర్పులు చేపట్టారు. ఇందుకు గంటకు రూ.1600 అద్దె చెల్లిస్తున్నారు. పాడేరు,రంపచోడవరం డివిజన్‌ల పరిధిలో సుమారు 100 యంత్రాల ద్వారా నూర్పులు జరుగుతున్నాయి.

వరి కోతలు వద్దు

తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఖరీఫ్ వరి కోతలను కొద్దిరోజులపాటు నిలిపివేయాలి. పొలాల్లో ఆరబెట్టిన వరి పనలను కుప్పలుగా పెట్టుకోవాలి. లేదంటే గట్టుపై ఉంచాలి. వరి కుప్పలు పెట్టిన చోట నీరు నిలవకుండా ఉండేలా గాడి లేదా కాలువ ఏర్పాటుచేసుకోవాలి. వరి కుప్పలపై ప్లాస్టిక్ కవర్లు,టార్పాలిన్లు కప్పాలి. ఒక వేళ వరి పనులు తడిస్తే లీరు నీటిలో 50 గ్రామాల ఉప్పును కలిపి వాటిపై పిచికారీ చేయాలి. దీనివల్ల మొలకలు రాకుండా కాపాడుకోవచ్చు.

– నందు, జిల్లా వ్యవసాయాధికారి



వరి కుప్ప తడవకుండా బరకాలు కప్పిన రైతులు



రాజవొమ్మంగి ప్రాంతంలో నేలకొరిగిన వరి పంట



పొలంలో ఆరబెట్టిన వరి పనలు

కొనుగోళ్లు ముమ్మరం



ధాన్యం కొనుగోలు చేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు మండలంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. జడ్డంగి రైతుభరోసా కేంద్రం పరిధిలో జోరుగా సాగుతున్నాయి. సిబ్బంది రైతుల క్షేత్రాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు 12 లారీల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. రాజవొమ్మంగిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి.

పేదరికం లేని గ్రామాలే లక్ష్యం

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర. చిత్రంలో సీఈవో

మహారాణిపేట(విశాఖ దక్షిణ): పేదరికం లేని గ్రామాలే ప్రభుత్వ లక్ష్యమని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. శుక్రవారం ఉదయం జెడ్పీ సమావేశ మందిరంలో ప్రజా ప్రణాళిక ప్రచారం – 2022 కార్యక్రమంలో భాగంగా జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జిల్లా అధికారులకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులంతా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. భారత రాజ్యాంగంలోని 73వ రాజ్యాంగ సవరణ చట్టం 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రభుత్వ శాఖల సమన్వయంతో, ప్రజల భాగస్వామంతో ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధికి ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. ప్రజా ప్రణాళిక ప్రచారం 2022లో భాగంగా ఈ ఏడాది 2 అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది జనవరి 31 వరకు పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల స్థాయిలో ప్రణాళిక తయారీ పూర్తికావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవోశ్రీరామమూర్తి, డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీఎల్‌జీఏ వారోత్సవాలు భగ్నం

ఎస్పీ సతీష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాతో పాటు,సరిహద్దు ఒడిశాలో మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన పీఎల్‌జీఏ వారోత్సవాలకు ప్రజల నుంచి స్పందన లేదని,పోలీసు యంత్రాంగం కూడా భగ్నం చేసిందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ఈ నెల రెండవ తేదీ నుంచి 8వతేదీ రాత్రి వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలతో ఏవోబీ వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరగలేదన్నారు. నిషేధిత మావోయిస్టుల కార్యకలపాలు నిర్మూలన లక్ష్యంగా ఏవోబీతో పాటు, సరిహద్దు ఛత్తీస్‌ఘడ్ ప్రాంతాల్లోనూ పోలీసు బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయన్నారు. మావోయిస్టులను అడ్డుకోవడంలో తమ పోలీసు బలగాలు విజయం సాధించాయని ఆయన తెలిపారు. వారోత్సవాల సమయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడలేదని, రవాణా వ్యవస్థ యాథివిధిగా పనిచేసిందన్నారు. వారపుసంతలు జరిగాయని ఆయన తెలిపారు. ఏవోబీ వ్యాప్తంగా ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, మావోయిస్టు పార్టీలో ఉన్న కొద్దిపాటి క్యాడర్, మిలిషీయా వ్యవస్థ కూడా లొంగుబాటు ద్వారా జనజీవన స్రవంతిలో కలిసి, ప్రశాంత జీవనం గడిపేందుకు ముందుకు వస్తుందని ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులు, మిలీసియా సభ్యులకు ప్రభుత్వ సహకారంతో పునరావస కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.



హెల్ప్ లైన్ డెస్కులను ప్రారంభిస్తున్న ఎస్పీ

అరకులోయ రూరల్: పోలీస్ సేవలు మరింత విస్తృత పరచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక వైఎస్సార్ జంక్షన్‌లో సీఐ జీడీ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ హెల్ప్‌లైన్ డెస్క్ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగ ప్రజ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు: ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అరకులోయ, పాడేరు, అనంతగిరి, లంబసింగి తదితర ప్రాంతాల్లో ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టామని చెప్పారు. ఎటువంటి సలహా, సూచనలు కావాలన్నా హెల్ప్‌లైన్ కేంద్రాల్లో సంప్రదించవచ్చన్నారు, ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో మహిళా పోలీసులు హెల్ప్‌లైన్ డెస్క్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారన్నారు. అరకులోయ ,డుంబ్రిగుడ ఎస్‌ఐలు సంతోష్, సంతోష్‌కుమార్, వైఎస్సార్ సీపీ బీసి విభాగం జిల్లా అధ్యక్షులు నర్సింగరావు, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ ఆనంద్‌కుమార్, భీమరాజు, సర్పంచ్ దాసుబాబు పాల్గొన్నారు.

చిరుత సంచారంతో కలకలం

గంగవరం : రంపచోడవరం డివిజన్‌లో గంగవరం, రంపచోడవరం ప్రాంతాల్లో చిరుత సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో పెదగార్లపాడు శివారు శ్మశాన వాటిక వద్ద చిరుత సంచారాన్ని గుర్తించినట్టు గిరిజనులు తెలిపారు. పెదగార్లపాడు– గొరగుమ్మి గ్రామాలకు వెళ్లే రహదారిలో కంటపడిందని వారు వివరించారు. ఫోక్సుపేట రేంజ్ పరిధిలో పిడతమామిడి ఫారెస్టు సెక్షన్ దొరమామిడి అటవీ ప్రాంతంలో చిరుతపిల్లలతో సంచరించడం వాస్తమేమని అటవీశాఖ అధికారులు చెబుతున్నా రు. దీంతో ఈమార్గంలో రాత్రి వేళల్లో వెళ్లేందుకు వాహనచోదకులు భయాందోళనలు చెందుతున్నారు.

ఉన్నత లక్ష్యంతో మంచి భవిష్యత్తు

బాలికలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: బాలికల ఉన్నత చదువుల లక్ష్యంతో మంచి భవిష్యత్తు ఏర్పరచుకోవడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. స్థానిక గిరిజన గురుకుల విద్యాలయంలో మహిళా శిశుసంక్షేమశాఖ మహిళలపై హింసలు నిర్మూలనపై నిర్వహించిన సదస్సును ఆయనతోపాటు పలువురు అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. పురుషులతో పాటు సమానంగా మహిళలు ఉద్యోగాల్లో రాణిస్తున్నారన్నారు. గురుకుల విద్యాలయానికి సంబంధించి ప్రహరీ నిర్మాణంతో పాటు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.అడిషనల్ ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ బాలికలు, యువతులు, మహిళలరక్షణ లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందన్నారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులకు గురైన సచివాలయాల్లోని మహిళా పోలీసులకు ఫిర్యాదుచేయాలని సూచించారు. ,24గంటల పాటు దిశా యాప్ కూడా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. మహిళా కమిషన్ సభ్యురాలు ఉమా మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకోవాలని, ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. థింసా నృత్యాలతో గిరిజన బాలికలు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షురాలు సరస్వతి, గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత నిర్ధారణ బాధ్యత ఆర్‌బీకేలదే

జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్



జేసీ శివశ్రీనివాస్

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన ధాన్యం నాణ్యతను నిర్ధారించే బాధ్యత రైతు భరోసా కేంద్రాలకు ఉందని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ తెలిపారు. ధాన్యం నాణ్యతకు సంబంధించి మిల్లర్లు, మధ్యవర్తులకు సంబంధం లేదన్నారు. రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల పరిధిలో 43 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇప్పటికే 404 మెట్రిక్ టన్నుల ధాన్యం ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా తేమ 17శాతం మించకుండా ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకోవాలని సూచించారు. రైతులు గోనె సంచి తెచ్చుకుంటే 40 కిలోల సంచికి రూ.3.39 పైసలు, హమాలీలకు క్వింటాకు రూ.25 చొప్పున కూలి చెల్లిస్తామన్నారు. వర్ష ప్రభావం తగ్గే వరకు రైతులు వరికోతలు చేపట్టవద్దని జాయింట్ కలెక్టర్ సూచించారు.

స్పందన వినతుల సత్వర పరిష్కారం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- 65 అర్జీల స్వీకరణ



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నందున ప్రజలకు నమ్మకం కలిగేలా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో గిరిజనుల నుంచి 65 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో స్పందన వినతులపై సమీక్షించారు. వినతుల పరిష్కారానికి అవసరమైతే ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని సూచించారు. ప్రతీ వినతికి సత్వర న్యాయం చేయడం ద్వారా స్పందనపై గిరిజనులకు నమ్మకం ఏర్పడుతుందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో స్పందన అర్జీలకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అర్జీదారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేసీ శివశ్రీనివాసరావు, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో దయానిధి, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, పలు ఇంజనీరింగ్ శాఖల ఈఈలు డీవీఆర్‌ఎం రాజు, లీలాకృష్ణ, బాలసుందరబాబు, డీఎల్పీవో కుమార్ పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- పెదబయలు మండలం పెదకోడాపల్లి,కిముడుపల్లి పంచాయతీల్లోని తులభరంగి,సేదుపుట్టు ఆదివాసీ గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలతో పాటు,ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని అదే గ్రామానికి చెందిన పాంగి ప్రసాద్ అర్జీ అందజేశారు.
- జి.కే.వీధి పంచాయతీ నూతిబంద గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని రమేష్, చిన్నారావు, కృష్ణ తదితరులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
- హుకుంపేట మండలం లోచలిపుట్టు,ఎగ సంతారి గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని,ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ పాడి అప్పలనాయుడు కోరారు.

ఇక సేవలు మరింత చేరువగా..

- చింతూరు నుంచి నాలుగు మండలాల పాలన
- రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో కార్యకలాపాలు ప్రారంభం
- రంపచోడవరం చేరుకున్న ఉద్యోగులు, సామగ్రి
- పూర్తిస్థాయిలో పోస్టుల భర్తీ





చింతూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి చేరిన సామగ్రి

చింతూరు: కొత్తగా ఏర్పాటు చేసిన చింతూరు రెవెన్యూ డివిజన్‌కు సంబంధించిన కార్యాలయంలో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. గతంలో రంపచోడవరం డివిజన్ కేంద్రానికి తరలించిన సామగ్రిని తిరిగి చింతూరు కార్యాలయానికి తీసుకొచ్చారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. గతంలో రాష్ట్ర విభజన అనంతరం ఎటపాక డివిజన్‌గా వుండగా జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా దీనిని రద్దుచేసి నాలుగు మండలాలను రంపచోడవరం డివిజన్‌లో కలిపారు. దీంతో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల ప్రజలకు రెవెన్యూ, పోలవరం సమస్యల పరిష్కారం కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత జూలైలో వరదముంపు ప్రాంతాల పర్యటనలో భాగంగా చింతూరు మండలం కుయిగూరు వచ్చారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మితో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు డివిజన్ కేంద్రం ఆవశ్యకతను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం డివిజన్ కేంద్రం ఏర్పాటుకు ఆమోదముద్ర వేశారు.

ఆమోదం తెలిపిన వెంటనే..

చింతూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి ఆమోదముద్ర పడిన వెంటనే డివిజన్ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. డివిజన్ ఏర్పాటును సెప్టెంబరు ఏడో తేదీన రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించింది. దీనిపై అభ్యంతరాల స్వీకరణ అనంతరం అంతే వేగంగా అక్టోబరు 20న చింతూరు రెవెన్యూ డివిజన్‌కు రాజముద్ర పడింది. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో దానికి అధికారి ఆవశ్యకత ఉండటంతో చింతూరు ఐటీడీఏ పీవోగా పనిచేస్తున్న రామశేషును బదిలీచేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోగా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను నియమించింది.

చింతూరుకు ఉద్యోగులు..

ఎటపాక డివిజన్ రద్దు కావడంతో చింతూరులోని డివిజన్ కార్యాలయ సామగ్రితో పాటు ఉద్యోగులు రంపచోడవరం డివిజన్ కేంద్రానికి తరలివెళ్లారు. చింతూరు డివిజన్ కేంద్రం ఏర్పాటైన నేపథ్యంలో రంపచోడవరం తరలించిన కార్యాలయ సామగ్రితో పాటు ఉద్యోగులు కూడా చింతూరు కార్యాలయానికి తిరిగి రావడంతో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. గతంలో మాదిరిగానే ఐటీడీఏ కార్యాయలంలోని పీవో చాంబర్ పక్కనే ఉన్న భవనంలో చింతూరు రెవెన్యూ డివిజన్ పరిపాలన కొనసాగనుంది. చింతూరులో నిర్మిస్తున్న రెవెన్యూ డివిజన్ కార్యాలయ నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. రెవెన్యూ డివిజన్ కార్యాలయం ప్రారంభం కావడంతో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన ప్రజలకు సంబంధించి రెవెన్యూ, పోలవరం, భూ సమస్యలకు దగ్గరలోనే పరిష్కారం లభించనుంది. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పరిపాలన ప్రారంభమైంది. ప్రస్తుతానికి ప్రాముఖ్యతను బట్టి ఇతర మండలాలకు చెందిన ఉద్యోగులను సర్దుబాటు చేశారు. త్వరలోనే పూర్తి స్థాయిలో ఉద్యోగుల నియామకానికి చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు గిరిజన విద్యార్థి


కుస్తీ పోటీలకు ఎంపికైన శివప్రసాదరెడ్డిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

వై.రామవరం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన ఆఫ్ ఇండియాలో భాగంగా వై.రామవరం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి పల్లాల శివప్రసాదరెడ్డి రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యాడు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా కాకినాడలో ఈనెల 7న జరిగిన జిల్లాస్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో శివప్రసాదరెడ్డి కుస్తీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం పల్లాల లక్ష్మణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థి శివప్రసాద్‌రెడ్డి, కోచ్ మహేష్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు అభినందనలు తెలిపారు.

పంట కోతపై జాగ్రత్తలు అవసరం


ఏడీఏ కంకిపాటి సావిత్రి

అడ్డతీగల: వరి పంట కోత దశలో వర్షాల వల్ల రక్షణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అడ్డతీగల సహాయ వ్యవసాయ సంచాలకులు కంకిపాటి సావిత్రి అన్నారు. పంట కోత దశలో ఉండగా అకాల వర్షాల వల్ల గింజలు మొలక రాకుండా రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ప్రయోజనం ఉంటుందన్నారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పంట కోతకు ముందు వర్షాలు వస్తే వరి వెన్నుల మీద 10 శాతం ఉప్పు నీరు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఒక లీటరు నీటికి 50 గ్రాములు ఉప్పుని కలిపి పిచికారీ చేసుకుంటే ఉపయోగం ఉంటుందన్నారు.వరి పైరు పనల మీద తడిస్తే ఉప్పు ద్రావణంలో ఒక లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి కంకులను ముంచి ఆరబెట్టాలన్నారు. ఉప్పు ద్రావణం వాడడం వీలుకాని పక్షంలో తడిచిన పనలను ఆరబెట్టి కుప్పలుగా వేస్తే ఉప్పు పొడిని వరి కంకుల మీద చల్లాలని సూచించారు. నూర్చిన తరువాత వరి ధాన్యం తడిస్తే క్వింటా ధాన్యానికి ఒక కిలో కళ్లు ఉప్పు నాలుగు కిలోల ఊక లేదా గడ్డి చిన్న చిన్న ముక్కలుగా చేసి కలిపి కుప్పలుగా పోసి వారం రోజుల తరువాత ఆరబెట్టాలన్నారు. వర్షప్రభావం వల్ల రైతులు పంట నష్టపోకుండా ఉండడానికి క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బంది ద్వారా రైతుల్లో అవగాహన పెంపొందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్లు అరెస్టు

చోడవరం రూరల్: మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో శుక్రవారం జరిపిన దాడిలో ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ బి.అప్పలనాయుడు చెప్పారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామం శివారులో తమ సిబ్బందితో దాడి చేయగా పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి పేకాటలో పణంగా ఒడ్డుతున్న 5040 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచనున్నట్లు చెప్పారు.

సారా బట్టీలపై దాడులు


సారా బట్టీలపై దాడులు నిర్వహిస్తున్న ఎస్‌ఈబీ, బీఎంపీపీ సిబ్బంది

అనంతగిరి : కొత్తూరు పంచాయతీ గంగవరం గ్రామంలో సారా బట్టీలపై ఎస్‌ఈబీ, బోర్డర్ మొబైల్ పోలీస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో సారా నిర్మూలనకు మహిళలు, యువత ముందుకు రావాలని, సారా అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఈబీ ఎస్‌ఐ దాసు హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది మదుసుధన్‌రావు, సత్యం పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆత్మహత్యపై పూర్తిస్థాయి దర్యాప్తు


ఎస్పీ సతీష్‌కుమార్‌తో ఫోన్లో మాట్లాడుతున్న అరకు ఎంపీ మాధవి

కొయ్యూరు: పెదబయలు తహసీల్దార్ శ్రీనివాసరావు ఆత్మహత్యకు సంబంధించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని ఎస్పీ సతీష్‌కుమార్‌ను అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. ఆయనతో శుక్రవారం ఫోన్లో మాట్లాడారు. విచారణ వేగవంతం చేయాలని ఆమె కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను ఆమె ఫోన్లో పరామర్శించారు.

నేటి నుంచి పాఠశాలలో స్వర్ణోత్సవ సందడి

- జెడ్పీహెచ్‌ఎస్‌లో పూర్తయిన ఏర్పాట్లు
- వేడుకలకు హాజరుకానున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు


స్వర్ణోత్సవాల సందర్భంగా ఆవిష్కరించనున్న మహనీయుల విగ్రహాలు


జిల్లా పరిషత్ హైస్కూల్

చింతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్ణోత్సవాల సందడి నెలకొంది. శని, ఆదివారాల్లో ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. 1974 నుంచి 2022 వరకు ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఈ వేడుకకు హాజరు కానున్నారు. ఇక్కడ విద్యనభ్యసించిన ఎంతోమంది విద్యార్థులు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో స్థిరపడ్డారు. 49 ఏళ్ల అనంతరం ఆనాటి విద్యార్థులు, గురువులు ఒకేచోట కలిసే అపూర్వమైన ఘట్టానికి ఈ పాఠశాల వేదిక కానుంది. స్వర్ణోత్సవ కార్యక్రమాల్లో భాగంగా తమకు విద్యనేర్పిన 70 మంది గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించనున్నారు. స్వర్ణోత్సవానికి చిహ్నంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన సుమారు 1,500 మంది విద్యార్థులు వేడుకకు తరలి రానున్నారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించి స్థానికంగా ఉన్న పూర్వ విద్యార్థులు గత నెల రోజులుగా స్వర్ణోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే అనేకమంది పూర్వ విద్యార్థులు తమ విరాళాలతో ఈ పాఠశాలలో అనేక మౌలిక వసతులు కల్పించారు. స్వర్ణోత్సవాల సందర్భంగా పాఠశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్, బీఆర్ అంబేడ్కర్, సావిత్రిబాయి పూలే విగ్రహాలను కూడా ఆవిష్కరించనున్నారు. పూర్వ విద్యార్థులు, గురువుల కలయికతో రెండ్రోజుల పాటు అతిథి సంబరాలకు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల వేదిక కానుంది.

రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు గిరి విద్యార్థులు


శ్రీహరికోటను సందర్శించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెదబయలు: రాష్ట్రస్థాయి జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీలకు జిల్లా నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 10,11 తేదీల్లో తిరుపతి జిల్లా గూడూరులో జరిగే రాష్ట్ర స్థాయి, సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో పాల్గొంటారు. పెదబయలు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి కె. మల్లేష్ చుట్టుమెట్ట గ్రామాన్ని యూనిట్‌గా తీసుకున్నాడు. గతంలో గ్రామాల గిరిజనులు జీవన విధానం, ఆహార అలవాట్లు, ఇదే గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో కాఫీ ప్లాంటేషన్లు తద్వారా సొంతంగా కాఫీ ప్లాంటేషన్లు ఏర్పాటు వల్ల సాధించిన మార్పుపై రూపొందించిన ప్రాజెక్టు ఎంపికై ంది. ఇలా మరో నలుగురు విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రాజెక్టులకు గుర్తింపు లభించింది. వీరితోపాటు ఉపాధ్యాయులకు అంతరిక్ష కేంద్రం శ్రీహరికోటను సందర్శించే అవకాశం కల్పించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీల్లో కూడా సత్తాచాటుతామని వారు పేర్కొన్నారు. రేపటి నుంచి జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయుల కోఆర్డినేటర్ రామూర్తి నాయుడు, జిల్లా అకాడమి కో ఆర్డినేటర్ జానకి రామారావు, గైడ్ టీచర్లు బాలకృష్ణ, నాగరాజు పడాల్, ప్రసాదరావు, సత్యవతి, సతీష్ థామస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేరు జలాశయంలో యువకుడి గల్లంతు

మాడుగుల రూరల్ : మండలంలో కింతలి గ్రామానికి చెందిన దామరౌతు శ్రావణ్‌కుమార్(26) పెద్దేరు జలాశయంలో పడి గల్లంతైనట్టు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. దీంతో జలాశయంలో ఆ యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మాడుగుల అగ్నిమాపకదళాధికారి బోగీశ్వరావు ఆధ్వర్యంలో నాటుబోట్ల సాయంతో తాడు ద్వారా దిగి సిబ్బంది జలాశయంలో గాలిస్తున్నారు. సాయంత్రం 6 గంటలైనా ఆచూకీ తెలియలేదని ఎస్‌ఐ దామోదరనాయుడు తెలిపారు. కాగా గల్లంతైన శ్రావణ్‌కుమార్‌కు చెందిన బైక్, చెప్పులు, జలాశయం గట్టు మీద వున్నాయని, శుక్రవారం జలాశయం గట్టు మీద పెట్టి జలాశయంలో దిగి ఆత్మహత్య చేసుకున్నాడని, అతని కుటుంబ సభ్యులు, స్నేహితులు తెలిపారు. కాగా శ్రావణ్‌కుమార్ ఆచూకీ కోసం శనివారం కూడా గాలింపు చర్యలు చేపట్టతామని ఎస్‌ఐ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- అడ్డతీగలలో కొనుగోలు కేంద్రం ప్రారంభం


అడ్డతీగలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పండించిన పంటకు ప్రభుత్వమే గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందన్నారు.సాగుకు వివిధ రకాల ప్రోత్సాహక పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. కొద్దిరోజుల్లో రంపచోడవరం,చింతూరు డివిజన్లలోని కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని ఆమె పేర్కొన్నరు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల ఏడీఏ సావిత్రి, రాష్ట్ర రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కారు రాంబాబు, వైస్ ఎంపీపీలు కరణం వీర వెంకటరమణ,గంధం బాలసుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైద్య సేవలపై నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

డుంబ్రిగుడ: వైద్య సేవలపై నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని, విధులకు హాజరుకాని వైద్యాధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. మండలంలో కిల్లోగుడ పీహెచ్‌సీని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఆ సమయంలో పీహెచ్‌సీలో 13 మంది సిబ్బందికి ఏఎస్‌ఎం, స్టాఫ్ నర్సు, ఎంఎస్‌వో ముగ్గురు మాత్రమే విధుల్లో ఉండడంతో సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ఆస్పత్రిలో పర్యవేక్షణ, పారిశుధ్యం కొరవడిందని, ఉదయం 10 గంటలు కావస్తున్నా వైద్యులు, సిబ్బంది విధులకు హాజరుకాకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యంపై పెద్దపీట వేస్తుంటే.. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇకపై సమయపాలన పాటించని వారిని ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, నాయకులు మోహన్, సింహాచలం, కృష్ణారావు పాల్గొన్నారు.